



"ఏమోయ్! ఏం జేస్తున్నావ్?"

అప్పుడే ఆఫీసు నుంచి ఇంట్లోకి వస్తూ అన్నారు గోపాలరావుగారు.

"వస్తున్నానండీ!" అని లోపల్నుంచి జవాబిచ్చి వచ్చిందాయన భార్య అరుంధతి మంచి నీళ్ళ గ్లాసుతో.

"అబ్బాయి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందాండీ?"

"ఆఁ-వచ్చింది."

చొక్కా తీసి వంకెకి తగిలించి నీళ్ళు త్రాగి పడక కుర్చీలో వుస్సురంటూ కూర్చున్నారాయన.

విసనకర్రతో విసుర్తూ, "ఏం రాశాడండీ పిచ్చినాయనా? అక్కడంతా బావుందిటనా? హోటల్ భోజనం కొంచెం నయంగానే వుందిటనా? అన్నట్టు ఇల్లదీ సౌఖ్యంగా వుందనేమైనా రాశాడండీ!" అంది ఆదుర్దాగా.

"ఆఁ-ఆఁ-అంతా బావుందిట."

"ఏం బాగులేద్దురూ? బాగో

లేకంటే మనమెక్కడ బాధ పడి పోతామోనని అలా రాసుంటాడు గాని, విశాఖపట్నం గురించెవరికి తెలీదండీ! ఏం ఇబ్బందులు పడుతున్నాడో ఏమో-పిచ్చికూన!"
మాతృహృదయం తల్లడిల్లింది.

"అద్సరేగాని, ఓ ముఖ్య విషయం కూడా రాశాడోయ్!"

"ఏ విషయమండీ!"

"మొదటి నెల జీతం రాగానే మీకేదో ప్రెజంటేషన్ తెస్తాట్ట. మీకేం కావాలో కనుక్కుని రాయమన్నాడు."

"నాకాండీ!" విస్మయంగా అంది.

"మీకేనే. పెద్ద వాడికన్నా వీడు మీయమేలే. ఇంతకీ మీకేం కావాలే!" హాస్యమాడారాయన.

"చాలెద్దురూ! వాడేదో సరదాగా రాస్తేనూ!" మనస్సు ఆనంద నాట్యం చేస్తోంటే అందామె.

"సరదాక్కాదోయ్! నిజంగానే రాశాడు. కావలిస్తే నువ్వే చూడు!" ఉత్తరం అందివ్వబోయారాయన.

"మీరు చదివేరుగా-మళ్ళీ నేను చదవాలేమిటెద్దురూ!"

"సరేలే-ఏం కావాలో బాగా ఆలోచించుకో!" నవ్వేరాయన. "అన్నట్టు మన రామనాథం బజారుకి రమ్మన్నాడే - వాళ్ళమ్మాయికేవో సామాన్లు కొనాలట...." అంటూనే చొక్కా తొడుక్కుని వెళ్ళిపోయారాయన హడావుడిగా.

అరుంధతి కొడుకురాసిన ఉత్తరాన్ని చదివింది ఆత్రంగా.

నా మొదటినెల జీతంతో అమ్మ కోరుకున్నదాన్ని కొనివ్వాలని నిశ్చయించుకున్నానంటూ స్పష్టంగా రాశాడు వాసు.

ఆమె హృదయ మయూరం కారు మబ్బుల్ని చూచినట్లు పురివిప్పి ఆడింది-పాడింది!

గబుక్కున ఉత్తరాన్ని ముద్దు పెట్టుకుని నా 'బంగారు కొండ!' అనుకుంది పరమానందంగా.

'మీకేం కావాలో చెప్పు అదెంత ఖరీదైనా సరే-తెచ్చిస్తా' మని ఎవరన్నారు?

కన్నతండ్రి అన్నాడా?—లేదు.

తోడబుట్టిన వాళ్ళన్నారా?—లేదు.

కట్టుకున్న భర్త అన్నారా?—లేదు.

తొలిసారి ప్రేగు త్రెంచుకుని పుట్టిన పెద్దబ్బాయి అన్నాడా?—లేదు, లేదు.

కాని చిన్నబాబు-నిన్న మొన్నటి వరకూ తప్పటడుగులేస్తూ, బోసి నవ్వుల్తో మురిపిస్తూ, తన ఒడిలో దొర్లిన చినబాబు అన్నాడు—

"అమ్మా! నీ కోరికేమిటో చెప్పూ!"
అని.

ఏ తల్లికైనా ఇంతకంటే ఏం కావాలి?

ఆమె తనువులోని ప్రతి అణువూ ఆనంద పారవశ్యాన్ననుభవిస్తోంది.

తనకేం కావాలి?

చిన్నప్పటి సంఘటన కళ్ళ ముందు సజీవంగా రూపుదాల్చింది.

అప్పుడు తనకి ఎనిమిదేళ్ళు. తమది ఒకమాదిరి మధ్యతరగతి కుటుంబమేమో—గొప్పవారన్నా, వారి ఇళ్ళన్నా, వారు ధరించే నగలూ, వస్త్రాలు అన్నా తనకెంతో మోజుగా, గొప్పగా, ఆరాధనగా వుంటూండేది. కాని వాళ్ళు తనని సరిగా లోపలికి రానిచ్చే వారు కాదు—ఏమైనా పట్టుకుపోతారేమోనని!

ఓ సారి మునసబుగారింటికి అమ్మతో కలిసి పేరంటానికెళ్ళింది. మునసబుగారి చిన్నమ్మాయి గచ్చకాయ రంగు కంచి పట్టుచీర కట్టుకుంది. క్రింద అంచులో నెమలిపించంలా వున్న జరీపని తనం! పైట అంచుమీద జతలూ, ముగ్గులూ! తనెన్నడూ అంత చక్కని చీర చూడలేదేమో! సరే చీరా తనకంత గొప్పగా నచ్చలేదేమో! చూపులు మరల్చకుండా ఆ చీరనే చూస్తుండిపోయింది తను. అమ్మావాళ్ళూ ఏవో కబుర్లు చెప్పుకొంటోంటే తను మాత్రం మునసబుగారి అమ్మాయి వెనకనే తిరగసాగింది.

అందంగా నున్నగా మెరుస్తూ, మైమరిపిస్తోన్న ఆ కంచి పట్టు చీరనోసారి చేతితో తాకాలని ఎంతో ఇదిగా అనిపించింది. అందుకే ఆమెతోబాటే తిరిగింది గాని, ఆమెని తాకడానికి ధైర్యం చాల్లేదు. ఓసారి గబుక్కున పమిట అంచు పట్టుకోబోయింది గాని, ఆవిడ తన చేతుల్ని త్రోసేసి అసహ్యంగా చూస్తూ, "ఆ పాడు చేతుల్తో నా చీరని పాడుచేస్తావేం? వెళ్ళు-వెళ్ళక్కడ కూర్చో" అని కసిరింది.

తనకెంతో బాధనిపించింది. సిగ్గనిపించింది. రోషం వచ్చింది. అయినా ఆ చీరని, చూడకుండా వుండలేకపోయింది.

ఆవిడన్న మాటలు అమ్మవింది కాబోలు, ఇంటికొచ్చాక ఒక్కటేసింది—"వాళ్ళ బట్టల్తో నీకేం పనే దెష్టా!" అంటూ.

అయినా తనకి ఏడుపు రాలేదు.

ఆ చీరని ఒక్కసారి తాకాలన్న కోర్కె నణచుకోలేక మునసబుగారి మనవరాలితో స్నేహం

చేసి, ఇంట్లో తనకి పెట్టిన తాయిలాలన్నీ ఆమెకి పెట్టి, కాకా పట్టి ఆ చీరనోసారి చూపమంది. కావి, "అమ్మో! మా అత్త చంపేస్తుంది. పెళ్లో పెట్టుకుని తాళం వేసిందే" అంటూ నిరాశ పర్చేసింది కడకి.

అయినప్పటికీ ఆ చీరమీద తనకి మోజు పోలేదు.

తను పెద్దమనిషైనప్పుడు గచ్చ కాయ రంగు పట్టు పరికిణీ, వోణీ కావాలని పేచీ పెట్టింది.

"ఇప్పుడెందుకే! పెళ్ళికి కొంటాంగా!" అని తల్లి సర్ది చెప్పడంతో పెళ్ళికి మునసబు గారమ్మాయికున్న పట్టు చీర లాంటిదే కావిపించుకోవాలని గట్టిగా అనుకుంది.

మరో మూడేళ్ళకా్కాటోలు—తనని చూడటానికి పెళ్ళివా రొస్తున్నారని ఇంట్లో వాళ్ళంతా హడావుడి పడ్డారు. ఎవరెవరివో బంగారు నగలు తెచ్చారు—తన నలంకరించడానికి. అప్పుడు పుట్టింట్లోనే వున్న మునసబుగారి చిన్నమ్మాయి పెళ్ళి చూపుల రోజున తన కంచిపట్టు చీర ఇస్తానంది. "మా అరుంధతికి మంచి చీరల్లేవు మీ చీరోటి ఇస్తారా?" అని అమ్మ అడగ్గానే.

ఆ వార్త విని తనెంత మురిసి పోయిందో—ఎన్నెన్ని రంగుల వూహల్లో తేలిపోయిందో-ఇప్పటికీ తనకు గుర్తే.

ఒకనాడు ఆ చీరని తాకితే చాలు—ధన్యమైపోయినట్లే అను కుంది తను. అప్పుడా చిన్న కోరికే తీరలేదు. అయితే నేం! ఇప్పుడేకంగా ఆ చీరనే కట్టుకో బోతోంది. కనీసంగా మూడు గంటలసేపైన ఆ చీర తన ఒంటి మీదే వుంటుంది.

ఎంతదృష్టం!

ఆ మాట విన్నప్పట్నుంచీ తను అద్దాన్ని వదల్లేదు. ఆ చీర కట్టుకుని, ఎరువు నగలు పెట్టు కుంటే—తనెంత రాజకుమారిలా వుండేదో తలచుకుని ఏవేవో సుందర లోకాల్లో ఆనందపు వూయల లూగింది.

తీరా పెళ్ళి చూపుల రోజున మునసబుగారి అమ్మాయి మరేదో వూరెళ్ళడంతో, ఆ చీర ఇవ్వ లేదు. మరెవరిదో ఖరీదైన చీర తెచ్చి కట్టబెట్టారు.

కాని—తన కళ్ళల్లోకి ఆనందం రాలేదు—కన్నీళ్ళు తప్ప!

"ఏమిటే? ఏమయ్యిందే?" అన్నారంతా.

ఏం చెప్పగలదు!

గుండెల్లోనే కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

కనీసం పెళ్ళికి తప్పకుండా గచ్చకాయ రంగు కంచిపట్టు చీర కొనిపించుకోవాలి—ఏడ్చి మొత్తుకునైనా సరే అనుకుంది.

ఆ రోజు కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని చూస్తోంటే ఆ రోజు రానే వొచ్చింది.

తామూ, మగపెళ్ళివారూ కలిసే బట్టలు కొందామని నిర్ణయించుకుని తమ తరపున తన తండ్రీ మేనమామ వెళ్తోంటే, "నాకు గచ్చకాయ రంగు కంచిపట్టు చీర కావాలే" అని చెప్పింది అమ్మతో.

ఆమె తనని అదోలా చూసి, "అమ్మాయికి కంచిపట్టు చీర కావాలని మోజు పడుతోందండీ!" అంది తండ్రితో.

"దానికేం లే! ఎప్పుడైనా కొనుక్కోవచ్చు. అల్లుడు వుద్యోగస్తుడు—నెలనెలా పది రాళ్ళు చేతిలోకొచ్చి పడుతూంటాయ్. ఎప్పుడు కావాలంటే అప్పుడే కొంటాడుగాని, ఇప్పుడలాంటివేం పెట్టకండి. మనం వాళ్ళంతక్కూడా పట్టు బట్టలు కొనొద్దనుకున్నాంగా! లేకపోతే వాళ్ళెలా వున్నా ముందు మనం సర్దుకోలేం" అన్నారాయన.

అవాళ తనెంత ఏడ్చిందో ఆ భగవంతుడికొక్కడికే తెలుసు!

"ఏమోయ్! ఏం జేస్తున్నావ్?"

భర్త గొంతు విన్పించగానే వులిక్కిపడి చూసింది అరుంధతి. కళ్ళముందు కటిక చీకటి. 'ఎప్పుడు చీకటి పడిందబ్బా!' అనుకుంటూ లేచి వెళ్ళి లైటువేసింది.

ఆమె కళ్ళ నీళ్ళు చూసి కంగారు పడ్డారాయన. "ఆ కన్నీళ్ళేమిటోయ్? ఒంట్లోగాని బావుండలేదా?"

"అబ్బే-ఏం లేదండీ!" తనకు తెలీకుండానే తను ఏడ్చిందని గ్రహించి సిగ్గు పడుతూ అంది గబగబా కళ్ళు తుడుచుకుంటూ.

ఆమెవంక అర్థంకానట్లు చూచి బట్టలు తీసి దండెంమీద వేసి, లుంగీ కట్టుకుని నూతి దగ్గరికెళ్ళి కాళ్ళూ చేతులూ కడుక్కొని వొచ్చారు గోపాలరావుగారు.

"రామనాథం బాబాయిగారు ఏమేం సరుకులు కొన్నారండీ కూతురికి?" టవల్ అందిస్తూ అడిగింది.

"స్టీలు సామాను కొన్నారు. అల్లుడికీ కూతురుకీ బట్టలు కూడా తీశారు."

"ఏం చీర కొన్నారండీ?" యధాలాపంగా అడిగింది.

"కంచిపట్టు చీర."

ఆమె గుండె లొక్క క్షణం సేపాగి తిరిగి కొట్టుకోసాగాయ్.

"రంగేమిటండీ!" ఆమె కంఠం వణికింది.

"వంకాయ రంగు."

చిన్నగా నిట్టూర్చి, "ధరెంతండీ!" అంది.

ఎప్పుడూ ఇలాటి విషయాలు తరచి అడగని భార్య ఇలా అడగటంతో ఆశ్చర్యపోతూనే, "మూడు వందల ఎనభై" అన్నారు.

"అబ్బో! దగ్గర దగ్గర నాలుగొందల రూపాయ లయ్యిందన్న మాట!" అనుకుంటూ వంటింట్లో కెళ్ళింది.

ఎంచేతో నీరసంగా దిగులుగా వుందామెకి. అన్యమనస్కంగానే వంట ముగించింది. అలవాటుకి భిన్నంగా కబుర్లు లేకుండా భోజనా లయ్యాయ్.

"ఏవిటదోలా వున్నావ్?" వక్కపొడి అందుకుంటూ అన్నారు.

"ఏం లేదండీ!"

మంచం వాల్చుకుందామె. ఆయనేవేవో కబుర్లు చెబుతోంటే వూం కొడుతూ కూర్చుందన్న మాటే గాని, తన ధ్యాసంతా పట్టుచీర చుట్టూనే తిరుగుతోంది.

"ఇంతకీ నువ్వేం కోరుకుంటున్నావోయ్?"

ఆవిడ మాట్లాడలేదు. నిద్ర పోయింది కాబోలనుకుని, రెట్టించ లేదాయన.

ఆమెకి నిద్ర పట్టడంలేదు.

ఆలోచనలు! ఎడతెరిపి లేని, వూపిరి కూడా పీల్చుకోనివ్వని ఆలోచనలు!

కాపురాని కొచ్చిన కొత్తలో, "నాకు ఎరియర్స్ అయిదారొందల వరకూ వస్తాయోయ్! ఏం కొందాం?" అన్నారాయన.

కొంచెం సంశయిస్తూనే అంది- "మీరేమీ అనుకోనంటే...."

"నేనేమనుకుంటానే పిచ్చిదానా! నీ మనస్సులోని మాటేమిటో చెప్పు!"

"గచ్చకాయరంగు కంచి పట్టుచీర కట్టుకోవాలని చిన్నప్పట్నుంచీ ఎంతో ఇదిగా వుందండీ!" తల వంచుకు నంది.

"ఓస్-ఇంతేనా? నేనింకా ఏదో అనుకున్నాను. అయినా ఈ వయస్సులో పట్టు చీరేమిటోయ్— ముసలమ్మల కేస్తు! బోల్డు క్రొత్త రకాలొస్తున్నాయ్-వాటిలో ఏదైనా తీసుకొందువుగాన్లే."

"కాని నాకా చీర మీదే వుందండీ!"

తన కంఠం వణకడం చూసి, "సరేలే-అలాగే కొందాంలే"

అన్నారు గోపాలరావుగారు.

తనాయన గుండెల మీద వాలి పోయి ఎన్ని ఆనంద భాష్పాలు రాల్చిందో, ఎంతగా పొంగి పోయిందో-తనకే తెలీదు!

కాని అదృష్టం చేతి కందినట్టే అంది, చేతి వ్రేళ్ళ సందుల్లోంచి జారిపోయింది. ఎరియర్స్ వచ్చాయి గాని, అప్పుడే తన మామగారికి సుస్తీ చెయ్యడంతో ఆ డబ్బు అలా ఖర్చైపోయింది.

తర్వాత తమ ఖర్చు పెరిగింది-పురుళ్ళకీ- పుణ్యాలకీ, చదువులకీ-సంధ్యలకీనూ.

తన కోరిక తీరే అవకాశం మాత్రం మళ్ళీ రాలేదు.

కనీసం పెద్దబ్బాయి పెళ్ళిలో నైనా కొనుక్కుందామని వుబలాట పడింది గాని, వియ్యాలవారు కట్నం భూమి రూపంలో ఇచ్చి, పెళ్ళి ఖర్చులకో రెండు వేలు మాత్రం ఇవ్వడంతో పట్టు చీర కొనడం సాధ్యపడలేదు.

నిట్టూర్చింది అరుంధతి!

మళ్ళీ ఇన్నేళ్ళకి తను యాభయ్యో పడిలో పడుతోంటే తనకీ అవకాశం వచ్చింది. 'నీ కిష్టమైందేమిటో చెప్పమ్మా! మొదటి నెల జీతంతో కొంటాను' అన్నాడు చిటి తండ్రి!

'తన ఎనిమిదేళ్ళ ప్రాయం నుంచీ తనతో బాటే ఎదుగుతోన్న కోర్కెని తీర్చమంటే!

ఈ వయస్సులో పట్టు చీరే మి టని నవ్వుతారేమో అంతా!'

ఆ రాత్రంతా ఆలోచిస్తూనే వుందామె పరి పరి విధాలా.

మర్నాడు ఆఫీసు కెళ్తూ, "అబ్బాయికి వుత్తరం రాస్తాను-ఏం రాయమంటావోయ్ నీ గురించి?" అనడిగారు గోపాల రావుగారు.

"వాడి ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమని రాయండి!"

"అలాగేలే! మరి నీ మాట? నిన్ను కనుక్కొని రాయమని మరీ మరీ రాశాడుగా. వాడంత ప్రేమగా రాసినప్పుడు మనం రాయకపోతే బాధపడతాడు."

అర క్షణం తటపటాయించి, "గచ్చకాయరంగు పట్టుచీర కొన మని రాయండి!" అంది.

"అరుంధతీ!"

ఆమె తలెత్తి ఆయన కళ్ళల్లో కోసారి చూసి తలదించుకొని చెమ్మగిల్లిన కళ్ళు తుడుచుకుంది.

"ఈ వయస్సులో...."

"ఇది వయస్సు కోరిక కాదండీ మనస్సు కోరిక. నాకు దేవుడు లాంటి మీరున్నారు. రత్నాల్లాంటి

బిడ్డలున్నారు. నాకే లోటూ లేదండీ! కాని ఆ చీర కట్టుకోవాలన్న కోరిక మాత్రం నన్ను వదలటం లేదండీ! కన్నవాళ్ళూ, కట్టుకున్న మీరూ తీర్చలేని నా కోరికని, నా కడుపున పుట్టిన చిన్నవాడు తీరుస్తానంటు న్నాడు. మీరు కాదనకండీ! ఆ ఒక్క కోరికా తీరితే హాయిగా కన్ను మూసినా ఫరవాలేదండీ...."

భార్యవంక సానుభూతిగా చూస్తూ, "అలాగేలే—అలాగే రాస్తాలే" అని వెళ్ళిపోయారాయన.

నాలుగో రోజున వాసు దగ్గ ర్నుంచి ఉత్తరం వచ్చింది-తాను అమ్మకోసం గచ్చకాయ రంగు కంచి పట్టుచీర కొనుక్కొని రెండో తారీఖున వస్తున్నానని.

అరుంధతి ఆనందానికి పగ్గాల్లేక పోయాయనే చెప్పాలి. సంతోషాతి శయంతో తల మున్కలవుతున్న ఆమెనీ, ఆమె వెర్రి ఆనందాన్నీ చూస్తుంటే గోపాలరావుగార్కి గాభరాగా కూడా వుంది.

అరుంధతి కలలు కన్నా, కబుర్లు చెప్పినా, కలవరించినా, గలగల నవ్వినా- అన్నీ కంచిపట్టు చీర గురించే.

ఇరుగమ్మకీ-పొరుగమ్మకీ, అడి గిన వాళ్ళకీ- అడగని వాళ్ళకీ ఆ విషయాలన్నీ చెబుతూ పొంగి పోతోంది-పరవశించిపోతోంది.

కాని—

వండుకున్న అన్నం తినడానికీ, కొన్న బట్ట కట్టుకోడానికీ కూడా ప్రాప్తం వుండాలంటారు.

ఆ ప్రాప్తమే కరువయ్యింది అరుంధతికి.

ఒకటో తారీఖు రాత్రి-తెల్ల వారితే వాసు గచ్చకాయ రంగు పట్టుచీరతో వస్తాడనగా-అరుంధతికి గుండెపోటు వచ్చింది. వెంటనే ఆసుపత్రిలో జేర్చారుగాని, డాక్టర్ల శ్రమ విఫలమయ్యింది.

సూర్యుడు ఉదయించకుండానే ఆమె ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది.

పాడెని సిద్ధం చేస్తోంటే, కొం డంత ఆనందంతో క్రొత్త చీరతో వచ్చాడు వాసు. తల్లి శవాన్నిచూసి భోరున ఏడ్చాడు.

అరుంధతి శవానికి స్నానం చేయించి, బొట్టుపెట్టి, పసుపురాసి, వాసు తెచ్చిన గచ్చకాయ రంగు పట్టు చీరని కట్టబెట్టి, పాడె ఎక్కించారు.

చితికి నిప్పంటించి, తల్లి శరీ రంతోబాటు కాలిపోతున్న తల్లి చిరకాల వాంఛితమైన గచ్చకాయ రంగు పట్టుచీరని చూసి, గుండెలు పగిలేలా రోదించాడు వాసు. ●